# కవితా కౌముది

## కలియుగ కుబ్జ
## అప్పికొండ భాగ్యలక్ష్మి

పాంథుడా! నే
జీవమెరుగని అందాన్ని
మనోవాక్కాయ కర్మేణ
పొంతనెరుగని త్రివక్రాన్ని
శరణువేడిన నీదాన్ని
త్రొక్కుమా నా పాదాల విష పద్మాల్ని
ఆదరించుమా నీ వేలితో పైకెత్తి నా మోము ని
గోపిక లెల్లరికి కళ్లు కుట్టేట్టు
నీ కైంకర్యముకై
జాబిలి నీడన వెన్నెల చీర కట్టి
చుక్కల కొప్పు చుట్టి
ఆత్మ చాటు వెన్నను దాచి పెట్టి
వేచియున్న కలియుగ కుబ్జను

★★★

## నువ్వు - నేను
## సుమ నల్లూరి

నేను చూసే ఆఖరి దృశ్యం నీ రూపం
నేను పలికే ఆఖరి పదం నీ పేరు
నిన్ను చేరే ఏ కష్టమయిన ముందు నన్ను తాకిన తర్వాతే,
నాకు తెలిసిన ప్రపంచం నీతోనే మొదలయి
నీతోనే అంతమవుతుంది!
అన్నింటికీ కారణం ఒక్కటే -
నువ్వు లేని నేను శూన్యం..!
నువ్వు కాని నేను అసంపూర్ణం ..!!

★★★



## ఆమె
## పోపూరి సురేష్ బాబు

కాలపు సముద్రంలో

నీటిచుక్క లాంటి ఓ రోజు

ముత్యమై ఆమె

కనిపించింది క్షణం పాటే

అయితేనేం...

అణువణువూ అనుక్షణమూ

ఒళ్ళంతా జలదరింపు

ప్రసారమైన తన చూపు

శరీరమంతా ప్రతిధ్వనించిన

ప్రకంపనం

విలువైన జ్ఞాపకంగా

కొలువై, కానుకై

గుండెలోతుల్లో నిక్షిప్తం

కరగని మంచులా ఎల్లకాలమూ...

★★★

## బాల్యం
## మూలా వీరేశ్వర రావు

ఆ బాల్యం

జీవిత కాన్వాసు పై

వెలిసిన వర్ణ చిత్రమది

పచ్చ చేల పాల కంకి

పొద్దు గుంకి పోయింది!

పిల్ల ఎంకి ఆనవాలు

పొలం గట్ల పై మాయమయింది!

పంట కాలువ ఎండి పోయింది

ఎర్ర కలువ మండి పోయింది

గోధూళి లో మెరిసిన మధూళి

మట్టి వాసన తో మిళితమై

మది పొరలలో ఒదిగిపోయింది

రాబడి లేని

బడి ఏనాడో ఏలుబడి నుండి

తప్పుకుంది !

మధుర స్వనాల రేడియో

ప్రాచీన రాగమై

పల్లె మర్రి చెట్టు ఊడల్లో చిక్కుకుంది !

ఇప్పుడు బాల్యం ఒక

పొలమారిన

జ్ఞాపకం !

కాల చక్రానికొక

ఒక వ్యాపకం !!

★★★

## నల్లబల్ల
## చొప్పల్లి సంతోష్ కుమార్

నిస్సంగత్వానికి నిలువెత్తు రూపం
నల్లబల్ల..
రాసేదెవరో, రాస్తున్నదేమిటో
ఏదీ సంబంధం లేని నిజమైన
యోగి హృదయం అనిపించదూ!!!
నల్లబల్లని చూస్తూంటే...
పసిపిల్లలు అడ్డదిడ్డంగా గీసిన ఊహల
గీతల్నే
అందమైన చిత్రాలుగా భావించి
మురిసిపోతున్నా,
బడిలో మాష్టారు భావి భారతపౌరుల
తయారీకి
ఒక పనిముట్టుగా వాడినా,
ఆకతాయిలు అశ్లీల రాతలు రాసినా
వీటన్నిటికీ సాక్ష్యం తాను కాదన్నట్టు
ఏదీ లోపల దాచుకోకుండా
సులువుగా ఖాళీ అయిపోయే
నల్లబల్ల..
ఆలోచిస్తే నిజంగానే
మన మనసులకు ఆదర్శమైతే
అనవసర ఒత్తిళ్ళకు సులువైన విరుగుడు
చూపే మనో విజ్ఞాన శాస్త్ర బోధన చేస్తుంది.

★★★

## చిరంజీవులు
## అగస్త్యప్రగడ హేమంత

అక్షరాలు ఆరాధించే వారొకరు,

అడుగుల్ని శాసించే వారొకరు!

సప్తస్వరాల్ని శ్వాసించే వారొకరు,

సప్త వర్ణాలతో సహజీవనం

చేసే వారొకరూ!

ఉలితో శిలలని సజీవం

చేసే వారొకరు.

కలలతో చెలిమి చేసి

వాటిని....దృశ్యకావ్యంగా

సాక్షాత్కరింపజేసే వారొకరు!

ఎన్నెన్నో కళలు

'కొన్నే' అజరామరాలు!

ఎందరెందరో కళాకారులు..

'కొందరే' చిరంజీవులు

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

గూడెరుంగని వాడైతి నాడు నేను
ఎచటనో తిండి యెచటనో యింత నిద్ర
తల్లిదండ్రులనింటినూరెల్ల విడచి
చేసితిని నిలకడ లేని జీవయాత్ర

ఒంటరిగ నేను తిరుగాడుచున్న వేళ
తోడు దొరికినదొక్క యద్భుతము వోలె
మధురతరమైన ప్రణయధామమ్ము దొరకె
కలలలో యెదురైన స్వర్గమ్ము పగిది

కరగుచున్నది జీవితకాలమిచట
తరుగుచున్నది యానంద ధార యిచట
మనసులో మృగ్యమగుచుండె మార్దవమ్ము
తీరికయె లేక బ్రతుకు నిస్తేజమయ్యె

కరచరణములనెవ్వరో కట్టి వేసి
ఈ గృహమ్మున నన్ను బందీగ చేసి
ఎత్తుకొనిపోయిరనురక్తినెడద నుండి
దృశ్యమానము కాక నిద్రించె ప్రేమ

శిలగ మారిన గుండెకు తెలియవిపుడు
వలపుబాటల పూవుల తలపు లన్ని
మనసు చైతన్యముడిగి స్తంభనమునొందె
నిదుర లేపెడు పిలుపెన్నడెదురు వచ్చు

COMMENTS